సాక్షి
జనగామ

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



'వందేభారత్' పరుగులు
కాజీపేట జంక్షన్ మీదుగా నేటి(గురువారం) నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. - 8లో▸



సేవ..మరింత చేరువ - 8లో▸
వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు అవసరమైన సేవలు పొందేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

గరిష్టం/కనిష్టం
33⁰/23⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఊరచెరువు మత్తడి పరిశీలన



చిల్పూరు: ఊర చెరువు మత్తడికి సంబంధించిన పూర్తి స్థాయి మరమ్మతుకు ఎస్టిమేషన్ ఇవ్వాలని ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని ఊరచెరువు పెద్ద మత్తడి వద్ద తలుపులు చెడిపోవడంతో చెరువులోని నీరు వెనక్కి పోతున్నాయని రైతులు అలుగు అశోక్, పోలేపల్లి రవికాంత్‌రెడ్డి, చొప్పరి రాజులు ఇరిగేషన్ అధికారులకు విన్నవించారు. దీంతో బుధవారం ఎస్ఈ సుధీర్‌తో పాటు ఈఈ వినయ్‌బాబు, డీఈఈ సంపత్‌కుమార్, ఏఈ అభిరామ్‌లు చెరువు తూమును పరిశీలించారు. వర్షాలు రాకముందే మత్తడికి మరమ్మతుకు ఎంత ఖర్చు అవుతుందో ఎస్టిమేషన్ వేయడంతో పాటు పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: అర్హులైన మైనార్టీలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పనకు వృత్తి శిక్షణ సంస్థలను నియమించుకునేందుకు గానుగవర్నమెంట్, ప్రైవేట్ వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బి. రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వృత్తి శిక్షణ సంస్థలు జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ, టాస్క్, మెప్మా, బోర్డ్ ఆఫ్ ఇంటర్)తో గుర్తింపు పొంది ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వృత్తి శిక్షణ సంస్థలు తర దరఖాస్తులను మేనేజింగ్ డైరెక్టర్, టీజీ ఎంఎఎస్ హెడ్ ఆఫీ స్, 5వ అంతస్తు, నాంపల్లి, హైదరాబాద్ కార్యాలయంలో అక్టోబర్ 4వ తేదీ సాయంత్రంలోపు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కలెక్టరేట్‌లోని రూంనంబర్–25లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నర్మెట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నాయని, రాష్ట్రంలో రూ. 8 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, కళాశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యా సమస్యల పట్ల నిరంతర పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యాకన్న, రాథోడ్, అఖిల, ముఖేష్, శ్రీజ, హారిక, ప్రవీణ్, వేణు, రిషి, దీప్తి, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధులను అవమాన పర్చారు




జనగామ రూరల్: తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన యోధులను ప్రజాపాలన పేరుతో కలెక్టర్ అవమానపర్చారని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం ప్రభుత్వ ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులేనని, రాష్ట్రంలో సాయుధ పోరాట ఉద్యమానికి నాందిపలికి ఊపిరిగా నిలిచిన జనగామ గడ్డలో ఎందరో అమరులయ్యారన్నారు. నాటి పోరాటంలో అమరులైన కుటుంబాలను గుర్తించి సన్మానం చేయాల్సి ఉండగా ప్రజాపాలన కార్యక్రమంలో ఎలాంటి ఉద్యమ నాయకుల ప్రస్తావన చేయలేదన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఏ హోదాలో ప్రజాపాలన కార్యక్రమంలో స్టేజీపైకి వెళ్లాడని సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులే స్టేజీ పైనుంచి కొమ్మూరిని కిందికి దిగాలని కోరడం జరిగిందని, ఈ ఘటనపై కలెక్టర్‌పై గవర్నర్, సీఎస్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, అహల్య, బూడిద గోపి, జోగు ప్రకాష్, చందు నాయక్, వెంకట మల్లయ్య, కల్యాణ లింగం, శ్రావన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పక్క ఫొటోలో కనిపిస్తున్న వారు బచ్చన్నపేట మండలం బోనకల్లూరుకు చెందిన బియ్య నరేష్, లావణ్య కుటుంబ సభ్యులు. వీరికి వివాహమై 13 ఏళ్లు గడిచిపోయినా.. రేషన్ కార్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు, సబ్సిడీపై అందించే బియ్యం, ఇతర సరుకులు పొందలేకపోతున్నామని బాధపడుతున్నారు. రేషన్ కార్డు కోసం మూడుసార్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా.. మంజూరు కాలేదని, ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డుల మంజూరీకి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలా జిల్లాలో చాలా మంది లబ్ధిదారులు నూతన రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

కార్డులొస్తున్నాయి..

రేషన్ కార్డుల జారీకి కేబినెట్ సబ్ కమిటీఏర్పాటు
- త్వరలోనే విధివిధానాలపై ప్రకటన
- వచ్చే నెలలో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో కొత్తవి 11,961, మ్యుటేషన్ కోసం 3,659 అప్లికేషన్లు



జనగామ: తెల్లరేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు దరఖాస్తుల స్వీకరణకు త్వరలో విధి విధానాలు రూపకల్పన చేయనున్నారు. కార్డుల జారీకి సంబంధించి నిబంధనలపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 జూన్ 30న తెల్లరేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేయగా.. 2020లో కొంత మందికి అందించి తిరిగి ఫ్రీజింగ్ విధించింది. దీంతో అప్పటి నుంచి కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న కుటుంబాలతో పాటు పిల్లల పేర్లను నమోదు చేసుకోవడం, అడ్రస్, ఆధార్, ఫోన్ తదితర నంబర్లను సరి చేసుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 355 రేషన్ దుకాణాలున్నాయి. తెల్ల, అన్నపూర్ణ, అంత్యోదయ కార్డులు 1,61,145 ఉన్నాయి. ఇందులో 4,85,503 మంది కుటుంబ సభ్యులు ఉండగా, రేషన్ దుకాణాలకు 2,400 మెట్రిక్ టన్నుల బియ్యం అలాట్ చేశారు. కొత్తగా రేషన్ కార్డులతో పాటు తమ పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులను అందులో చేర్చాలని (మెంబర్ అడిషన్) కోరుతూ 7,115 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2017 జనవరి 1వ తేదీ నుంచి కొత్త తెల్లరేషన్ కార్డుల కోసం 11,961 దరఖాస్తు చేసుకోగా, పరిశీలన పూర్తి చేసుకుని అర్హతగా గుర్తించి పెండింగ్‌లోనే ఉంచారు. మ్యుటేషన్ (ఆధార్, అడ్రస్, ఇంటి నంబర్, రేషన్ దుకాణం బదిలీ మార్పు, ఫోన్ నంబర్ యాడ్ తదితర) కోసం 3,659 దరఖాస్తులు గ్రీన్ సిగ్నల్ కోసం ప్రభుత్వం వద్ద ఉన్నాయి.

వచ్చే నెలలో ముహూర్తం

గత ప్రభుత్వ హయాంలో తెల్లరేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనతో పాటు ప్రస్తుతం ఎలా స్వీకరించాలనే దానిపై ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించనుంది. ఈ నెల చివరి వారం లేదా వచ్చే నెల మొదటి వారంలో దరఖాస్తుల స్వీకరణకు ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దరఖాస్తులను స్వీకరించగా, వాటిని పరిగణలోకి తీసుకుంటూనే... కొత్త నిబంధనల ప్రకారం మరోసారి దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకున్న ప్రతీఒక్కరికి తెల్లరేషన్ కార్డు ఇస్తారా.. లేదా నిబంధనలు విధిస్తారా వేచి చూడాలి.

జిల్లాలో రేషన్ కార్డుల వివరాలు

రేషన్ దుకాణాలు	355
తెల్ల రేషన్ కార్డులు	1,53,301
అన్నపూర్ణ	90
అంత్యోదయ	10,751
కుటుంబ సభ్యులు (లబ్ధిదారులు)	4,85,503
బియ్యం అలాట్	2,400 మెట్రిక్ టన్నులు
2017 జనవరి 1 నుంచి కొత్తగా వచ్చిన రేషన్ కార్డు దరఖాస్తులు	11,962
మ్యుటేషన్ పెండింగ్ దరఖాస్తులు	3,659
నంబర్ అడిషన్ పెండింగ్ దరఖాస్తులు	7,115

ఎదురుచూస్తున్నాం..



తెల్లరేషన్ కార్డు ఉంది. ఇందులో మా కుమారుడి పేరును నమోదు చేయించుకునేందుకు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం. రేషన్ కార్డులో పేరు లేకపోవడంతో తనతో పాటు భార్యకు మాత్రమే బియ్యం వస్తున్నాయి. ప్రభుత్వం రేషన్ కార్డులో మెంబర్ అడిషన్‌కు అవకాశం కల్పిస్తామని చెప్పడంతో సంతోషంగా ఉంది.
- సిరికొండ ఉపేందర్, జఫర్‌గఢ్

ఆదేశాలు రాలేదు..

రేషన్ కార్డులకు సంబంధించిన జీఓ ప్రభుత్వం నుంచి ఇంకారాలేదు. ఇందుకు సంబంధించి విధివిధానాలు తమకు అందిన వెంటనే జిల్లాలో మండలాలు, గ్రామాల వారీగా విస్తృత ప్రచారం చేస్తాం.
- సరస్వతి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

అభ్యంతరాలు తెలపండి

- ముసాయిదా ఓటరు జాబితా సమీక్షలో కలెక్టర్ రిజ్వాన్ బాషా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: జిల్లాలో గ్రామ పంచాయతీల వారీగా ప్రదర్శించిన ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు తెలపాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీపీఓ స్వరూపతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 283 గ్రామ పంచాయతీ పరిధిలో 2,576 వార్డులున్నాయని, జీపీల వారీగా ఇతరులు నలుగురితో కలిపి 4,09,558 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుష ఓటర్లు 2,02,981, మహిళా ఓటర్లు 2,06,573 మంది ఉన్నారన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి కేంద్రాలు 2,576, బ్యాలెట్ బాక్సులు 2,041, పోలింగ్ సిబ్బంది 5,669 మంది సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో జరుగనున్నట్లు పేర్కొన్నారు. మొదటి దశలో జనగామ నియోజకవర్గంలోని నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట, జనగామ, లింగాలఘణపురం, రెండో దశలో పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల, మూడవ దశలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, రఘునాథపల్లి, జఫర్‌గఢ్ మండలాలు ఉన్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల అనంతరం, మండలాల ముసాయిదా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు జరగవచ్చన్నారు. జీపీ ఎన్నికల సమయంలో పూర్తి సహకారం అందించాలని పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ నెల 14 నుంచి 21 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి, 26వ తేదీ లోపు మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టి, 28న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, రాజకీయ పార్టీల నాయకులు భాస్కర్, రావెల రవి, విజయ భాస్కర్, జోగు ప్రకాష్, చంద్రశేఖర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేయాలి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, అధికారులు

జనగామ రూరల్: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయీస్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో హైదరాబాద్ నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోల ప్రణాళికపై జిల్లా అదనపు కలెక్టర్, సివిల్ సప్లయీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు కావాల్సిన గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో 4,74,950 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామని, 180 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ వీసీలో డీఆర్‌డీఓ వసంత, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ హతిరాం, సరస్వతి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

- అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్

స్టేషన్‌ఘన్‌పూర్: జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని, అవినీతికి పాల్పడితే తగిన చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధిలో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ విజయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అడిషనల్ డీఆర్‌డీఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్ఆర్‌పీ గంగరాజు పర్యవేక్షణలో డీఆర్‌పీలు గ్రామాల వారీగా ఈజీఎస్ పనులపై సమీక్ష చేపట్టారు. ప్రధానంగా గ్రామాల్లో చేసిన పనుల కొలతల్లో తప్పులు, మస్టర్లలో దోషాలు, కూలీలకు కూలీ చెల్లింపులో అవకతవకలు తదితర అంశాలు సభ దృష్టికి వచ్చాయి. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీఓ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా పనిచేస్తూ అవినీతికి పాల్పడితే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈజీఎస్ పనుల్లో తప్పులు చేసిన వారికి నిబంధనల మేరకు జరిమానాలు విధించడంతో పాటు రికవరీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, అంబుస్‌మెన్ రాజు, క్యూసీ రాజవర్ధన్‌రెడ్డి, ఏపీఓ ప్రేమయ్య, ఎస్ఆర్‌పీ గంగరాజు, డీఆర్‌పీలు, ఈసీలు, టీఏలు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

తరిగొప్పుల: గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులు చేస్తూ పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జీపీకార్యాలయంలో స్వచ్ఛ తాహీ సేవా 2024 కార్యక్రమంలో పాల్గొని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు చేపడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వరచారి, ఎంపీడీఓ దేవేందర్, ఎంపీఓ మాలతి, దేవేందర్, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

- కాంగ్రెస్ శ్రేణుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ: ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, యూత్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక చందర్, సీనియర్ నాయకులు మేడ శ్రీనివాస్ అన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీందర్ సింగ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో బీజేపీ నేత దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందిరా గాంధీకి పట్టిన గతే రాహుల్‌కు పడుతుందని తన్వీందర్‌సింగ్ బహిరంగంగా మాట్లాడినా..పీఎం, హోం మంత్రి స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీశైలం, మిద్దెపాక సిద్దులు, జమాల్ షరీఫ్, జాఫర్, సిద్దులు, సత్యం, సమ్మయ్య, కరుణాకర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో బీజేపీ పనైపోయింది..



హనుమకొండలోని అంబేద్కర్‌చౌరస్తాలో జరిగిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, తదితరులు

- అందుకే గాంధీ కుటుంబంపై అక్కసు
- రాహుల్‌గాంధీ అంటే ఆషామాషీ వ్యక్తి కాదు :టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్
- ఇందిరాగాంధీ కాలి గోటికి సరిపోరు : మంత్రి పొన్నం ప్రభాకర్
- రాహుల్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యలపై నిరసన ధర్నా

హన్మకొండ చౌరస్తా : 'జమ్మూకశ్మీర్‌లో బీజేపీ తుడుచుకుపెట్టుకుపోనుంది.. మహారాష్ట్రలో కాలం చెల్లింది, హరియాణాలో కాంగ్రెస్ రాబోతుంది.. మొత్తంగా భారత్‌లో బీజేపీ పనైపోయింది' అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీపై బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం హనుమకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్‌కుమార్‌గౌడ్ ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఆషామాషీ వ్యక్తి కాదన్నారు. భారత్ జోడో యాత్రలో ఆయనకు వచ్చిన జనాదరణతో భవిష్యత్ ప్రధానిగా తేలిపోయిందన్నారు. అందుకే కాంగ్రెస్‌ను ఎదుర్కోలేక గాంధీ కుటుంబంపై అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నలుగురు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ నాయకులకు ఏమాత్రం బుద్ధి ఉన్నా గాంధీ కుటుంబ చరిత్ర తెలుసుకోవాలన్నారు. బ్యాంకుల జాతీయకరణ, గరీబ్ హటావో లాంటి అనేక సంక్షేమ ఫలాలను అందించడమే కాకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. వారి కుటుంబం కాలి గోటికి సరిపోని వ్యక్తులు ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. బండి సంజయ్, కిషన్‌రెడ్డి, బీజేపీ తెలంగాణ నాయకుల స్టాండ్ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు కన్నెర్ర చేస్తే బీజేపీ నామరూపాలు లేకుండా పోతుందని హెచ్చరించారు. వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణిలు మాట్లాడుతూ కులగణనపై రాహుల్ గాంధీకి స్పష్టత ఉందని, 420 సీట్లు గెలుస్తామన్న బీజేపీకి నమ్మకం సన్నగిల్లిందన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్, టీపీసీసీ నాయకులు దొమ్మాటి సాంబయ్య, ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, జీవీఎస్ శ్రీనివాసచారి, కూచన రవళి, బంక సరళ, నాయిని లక్ష్మారెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, అంకూస్, మోజెస్ ఆనంద్, బుచ్చిరెడ్డి, సాంబయ్య, మండల సమ్మయ్య, పింగిళి వెంకట్‌రెడ్డి, రాజు, అశోక్‌రెడ్డి, నిమ్మాని శేఖర్‌రావు, కదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం.. భద్రకాళి అమ్మవారికి పూజలు

టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. ముందుగా ఆయన.. వరంగల్ భద్రకాళి ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు ఆయనకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మహాదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు.

రైతు బాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



ఎస్ఆర్ఎస్పీ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

కొడకండ్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తూ ఇచ్చిన హామీలకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతు బాంధవుడిగా సీఎం రేవంత్ రెడ్డి నిలిచారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని బయ్యన్నవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అవుట్ ఫ్లో గేట్లను ఎత్తి కాకతీయ మెయిన్ కెనాల్ ద్వారా సూర్యాపేట జిల్లాకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ 1000 క్యూసెక్కుల నీటి విడుదలతో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని రైతుల్లో ఆనందం నెలకొంటుందని, ఈ నీటిని విడుదల చేసే భాగ్యం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సాయుధ పోరాటం గురించి మాట్లాడే అర్హత బీజేపీ నాయకులకు లేదన్నారు. కొడకండ్లకు వచ్చిన ఎమ్మెల్యేను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్పీ డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సాక్షి నెట్‌వర్క్: ఈ నెల 11న అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్ అసోషియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఘన్‌పూర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఏ.శేఖర్, బి.ప్రణవిత్, బచ్చన్నపేట జెడ్పీ‌ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఏ. రామ్‌చరణ్, జనగామ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు రాంచందర్, కె. సందీప్‌కుమార్, జఫర్‌గఢ్ ఆదర్శ పాఠశాలకు చెందిన స్పందన, లావణ్య, పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గాయత్రిలు ఆయా క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పీఈటీలు విద్యార్థులు అభినందించారు.

క్లుప్తంగా

శ్రీధర్‌కుమార్‌లోథ్‌కు షోకాజ్ నోటీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పరిధిలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీలోని ఎకనామిక్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్‌కుమార్‌లోథ్‌కు కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి మంగళవారం రాత్రి షోకాజ్‌నోటీస్ జారీచేశారు. ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీలోని తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. సదాశివ్ తనను యూనివర్సిటీలోని తెలుగు విభాగానికి బదిలీచేయాలని శ్రీధర్‌కుమార్‌తో కలిసి వచ్చి బెదిరిస్తూ, అమర్యాదగా మాట్లాడారని ఆరోపిస్తూ ఈనెల 16న తెలుగు విభాగం అధిపతి ఏటూరిజ్యోతి ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. సీరియస్‌గా పరిగణించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. సదాశివ్‌కు, శ్రీధర్‌కుమార్‌లోథ్‌కు వేర్వేరుగా షోకాజ్‌నోటీస్‌లు జారీచేశారు. కాంట్రాక్టు సర్వీస్ కోసం ఒప్పందం, ప్రవర్తనానియమావళి నిబంధనలు ఉల్లంఘించారని, మీపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడురోజుల్లో ఇద్దరూ వివరణ ఇవ్వాలని షోకాజ్‌నోటీస్‌లో పేర్కొన్నారు.

వన్యప్రాణులను వేటాడి చంపిన ముగ్గురిపై కేసు


నిందితులను అదుపులోకి తీసుకుంటున్న అధికారులు

వెంకటాపురం(ఎం): విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను (అడవి పందులు) వేటాడుతున్న ముగ్గురిపై వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ములుగు ఎఫ్ఆర్ఓ డోలి శంకర్ తెలిపారు. మండలంలోని చెంచుకాలనీ శివారులో కొంతమంది అడవి పందులను వేటాడి చంపి కాల్చుతున్నారనే సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. చెంచుకాలనీకి చెందిన ఇండ్ల రవి, ఇండ్ల సారయ్య, ఆవుల వాసు.. సమీప అటవీప్రాంతంలో విద్యుత్ తీగలతో ఏర్పాటు చేసిన ఉచ్చుల్లో పడి బుధవారం తెల్లవారుజామున నాలుగు అడవి పందులు మృత్యువాత పడ్డాయి. ఆ పందులను చెంచుకాలనీ సమీపంలో కాల్చుతుండగా దాడి చేసి పట్టుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి బైండింగ్ వైర్, ఉచ్చులు, కత్తులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. దాడుల్లో డిప్యూటీ రేంజర్ మధుబాబు, ఎఫ్‌బీఓలు పులెందర్, కిషన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

సేవ.. మరింత చేరువ

19 ఫీచర్లతో టీజీ ఎన్పీడీసీఎల్ యాప్
- కొత్త కనెక్షన్ తీసుకోవడంతోపాటు సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు
- సెల్ఫ్ రీడింగ్‌తో పాటు బిల్లుల చెల్లింపు కూడా..
- మెరుగైన సేవలే లక్ష్యంగా ముందుకు..

హన్మకొండ: ఇక నుంచి విద్యుత్ సేవలు, సమస్యలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పని లేదు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు అవసరమైన సేవలు సులువుగా పొందేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటూ ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా వినియోగదారుల ముంగిటే సేవలు అందించేందుకు రూపొందించిన మొబైల్ యాప్‌ను మరింత ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటి వరకు నూతన విద్యుత్ సర్వీస్ పొందాలంటే మీ సేవకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు మొబైల్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. వినియోగదారుల సేవలకు సంబంధించిన 19 ఫీచర్లతో ఈ యాప్‌ను రూపొందించింది. దీంతో వినియోగదారులకు సేవలు మరింత చేరువయ్యాయి. మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సేవలు పొందొచ్చు. యాప్‌ను ఓపెన్ చేయగానే 19 ఫీచర్స్ కనిపిస్తాయి. అవసరమైన ఫీచర్‌పై నొక్కి సేవ పొందొచ్చు.

రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్ : ఎక్కడైనా ఎలాంటి ఘటనా జరిగిన ఇందులో జీపీఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుడి మొబైల్ ఫోన్‌లోని కెమెరా నుంచి ఆ ఘటనను ఫోటో తీసి పంపొచ్చు. తద్వారా ఈ రిపోర్ట్ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. వెంటనే ఆ అధికారి స్పందించి సమస్యను పరిష్కారిస్తారు.

కన్జూమర్ గ్రీవెన్సెస్: ఈ ఫీచర్‌లో మూడు రకాల సేవలుంటాయి. వినియోగదారుడు తమ సమస్యలను నేరుగా ఇందులో పొందుపరచొచ్చు. వారి మీటర్ నంబర్, సమస్య తాలూకు వివరాలు ఇందులో నమోదు చేస్తే ఆ సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించిన ప్రతి అంశం పై ఫిర్యాదు చేసుకునే సౌకర్యం ఈ ఫీచర్‌లో ఉంది.

సెల్ఫ్ రీడింగ్: ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ మీటర్ రీడింగ్‌ను తీసుకునే సౌలభ్యం ఉంది. ప్రతి నెల వినియోగదారులు తమ మీటర్ రీడింగ్ చేసుకుని కచ్చితమైన బిల్లింగ్ పొందొచ్చు.

పే బిల్స్: ఈ ఫీచర్ ద్వారా నెల వారి విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసుకుని చెల్లించే అవకాశముంది. ఇది చాలా సులభం. సౌకర్యవంతం. వ్యయప్రయసలు ఉండవు. కేవలం రెండు నిమిషాల్లో చెల్లించొచ్చు.

వినియోగదారుడి అరచేతి (ఫోన్)లో విద్యుత్ సమాచారం



టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్



వినియోగదారుల పరిధిలోని అధికారి వివరాలు:
వినియోగదారుల పరిధిలోని అధికారులకు సంబంధించిన వివరాలు ఈ ఫీచర్‌లో ఉంటాయి. తమ సందేహాలను సంబంధిత అధికారికి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

లింక్ ఆధార్– మొబైల్ నంబర్:
వినియోగదారుల ఆధార్, మొబైల్ నంబర్లు లింక్ చేసుకోవడం వల్ల ప్రతి నెల విద్యుత్ బిల్లుల ప్రతి సమాచారం ఫోన్‌కు అందుతుంది. తద్వారా వెంటనే యాప్ ద్వారా బిల్లులు చెల్లించొచ్చు.

కొత్త కనెక్షన్ ఎలా తీసుకోవాలి:
కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇందులో పొందుపరిచారు. విద్యుత్ కనెక్షన్ కోసం సమర్పించాల్సిన పత్రాల వివరాలు, సెక్యూరిటీ డిపాజిట్ వంటి వివరాలు ఇందులో కనిపిస్తాయి.

కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కటి డిజిటలైజేషన్‌గా మారుతోంది. ఈ చెల్లింపు శ్రేయస్కరం.

బిల్ హిస్టరీ: వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లుల గత చరిత్ర ఇందులో చూసుకోవచ్చు. తద్వారా ప్రతి నెల వచ్చే బిల్లు పోల్చుకోవడం ద్వారా విద్యుత్‌ను పొదుపుగా వాడుకునే అవకాశముంది.

ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ: ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల సమాచారాన్ని ఈ ఫీచర్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏ నెలలో ఎంత మొత్తం చెల్లించామనే వివరాలు ఇందులో నిక్షిప్తమై ఉంటాయి.

డొమెస్టిక్ బిల్ క్యాలిక్యులేటర్: వినియోగదారుల నెల వారి విద్యుత్ వినియోగం, మీటర్ రీడింగ్ వివరాలు ఇందులో పొందుపరిస్తే బిల్లుకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుస్తుంది.

పేరు, లోడ్ మార్పు గురించి: విద్యుత్ మీటర్ పేరు మార్పు ఎలా చేసుకోవాలి.. ఏ పత్రాలు సమర్పించాలి వంటి వివరాలు ఈ ఫీచర్‌లో ఉంటాయి. ఆ వివరాల ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పవర్ కంజంప్షన్ గైడ్ లైన్స్: విద్యుత్ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో ఇందులో వివరించారు.

టారిఫ్ డీటెయిల్స్: విద్యుత్ వినియోగం చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో పొందుపరిచారు. గృహ వినియోగదారులు, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు, ఇతర విద్యుత్ సర్వీస్‌లు చార్జీల వివరాలు పొందుపరిచారు.

ఎనర్జీ సేవింగ్ టిప్స్: ఇందులో విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నప్పుడు ఆచరించాల్సిన పొదుపు సూచనలు ఉన్నాయి. విద్యుత్‌ను ఎలా పొదుపుగా వాడుకోవచ్చో తెలుసుకునే సౌకర్యం ఉంది.

సేఫ్టీ టిప్స్: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకునే జాగ్రత్తలు ఇందులో వివరించారు. వినియోగదారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

ఫీడ్ బ్యాక్: వినియోగదారులకు అందిస్తున్న సేవలపై ఇక్కడ వారి అభిప్రాయాన్ని పంచుకోవచ్చు. ఇది చాలా ముఖ్యం. ఫీడ్ బ్యాక్ ఆధారంగా సేవల్లో మార్పు తీసుకురావడానికి దోహదపడుతుంది.

మై అకౌంట్: మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. వినియోగదారుడి సర్వీస్ వివరాలు, ఇతర సమాచారం ఉంటుంది.

వినియోగదారుల బిల్లు సమాచారం: వినియోగదారుల బిల్లు సమాచారం ఈ ఫీచర్‌లో ఉంటుంది. ఇందులో వినియోగదారుల సర్వీస్ నంబర్‌ను నమోదు చేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.

కాంటాక్ట్ అజ్: ఇందులో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు పొందుపరిచారు. వినియోగదారులు తమకు ఏదైనా అవసరం వస్తే ఫోన్ నంబర్ తెలుసుకోడానికి ఈ యాప్‌లో పొందుపరిచారు. ఈ టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమస్యలపై ఫిర్యాదులు చేసుకోవచ్చు.

పిల్లర్లే మిగిలాయి..


బాల్నిధర్మారం ఆకేరు వాగులో మిగిలిన బ్రిడ్జి పిల్లర్లు

- ఆకేరు వాగు ఉధృతికి కొట్టుకుపోయిన బ్రిడ్జి
- మహబూబాబాద్–ఖమ్మం జిల్లాల సరిహద్దు గ్రామాలకు రాకపోకలు బంద్

మరిపెడ రూరల్: ఇటీవల కురిసిన అతిభారీ వర్షాలకు వచ్చిన వరద నీరు ఉధృతికి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్నిధర్మారం శివారు ఆకేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోయింది. సుమారు 100 మీటర్ల దూరానికి బ్రిడ్జి కొట్టుకుపోయింది. కేవలం పిల్లర్లు మాత్రమే మిగిలాయి. మహబూబాబాద్– ఖమ్మం జిల్లాల సరిహద్దులోని ఆకేరు వాగుపై 2018లో రూ.16 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మించారు. దీంతో రెండు జిల్లాల సరిహద్దులోని గ్రామాలకు రాకపోకలు సురక్షితంగా జరిగాయి. ఈ క్రమంలో కేవలం ఆరు సంవత్సరాలకే బ్రిడ్జి కొట్టుకుపోవడంతో రెండు జిల్లాల మధ్య వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు మళ్లీ మొదలయ్యాయి. తక్కువ ఎత్తులో నిర్మించడంతోనే బ్రిడ్జి వరద ఉధృతికి కొట్టుకుపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రిడ్జిని పునరుద్ధరించి రాకపోకలు కల్పించాలని ఆయా జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.


వరదకు కొట్టుకుపోయి కొద్ది దూరంలో పడి ఉన్న బ్రిడ్జి

సినీ ఫక్కీలో చోరీ..

- కారు అద్దం పగులగొట్టి రూ.2లక్షల అపహరణ
- జనగామ జిల్లా కేంద్రంలో ఘటన

జనగామ: నగదు డ్రా చేసుకుని.. మరో బ్యాంకులో కొంత మొత్తంలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు తన కారును పార్క్ చేసి లోపలకు వెళ్లి వచ్చే సరికి దుండగులు సినీ ఫక్కీలో రూ.2 లక్షల నగదు అపహరించుకెళ్లారు. ఈ ఘటన బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా (యూబీఐ) వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన బిల్డింగ్ కాంట్రాక్టర్ ఎలబోయిన ప్రకాశ్ కొంతకాలంగా జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ రోడ్డులోని కెనరా బ్యాంకులో రూ.2.50లక్షలు డ్రా చేసుకుని తన కారులో సూర్యాపేట రోడ్డులోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా(యూబీఐ)కు మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వచ్చాడు. కారు అక్కడే పార్క్ చేసి తన వద్ద అప్పటికే ఉన్న రూ.50వేలతో పాటు డ్రా చేసుకున్న నగదు నుంచి మరో 50 వేలు కలిపి రూ.లక్ష డిపాజిట్ చేసేందుకు బ్యాంకు వెళ్లే సమయంలో మిగతా సొమ్ము రూ.2లక్షలు కారులోనే ఉంచాడు. అప్పటికే ప్రకాశ్‌ను గమనిస్తున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు.. పార్క్ చేసిన కారు ముందు భాగంలోని అద్దం పగులగొట్టి రూ.2 లక్షలు భద్రపరిచిన బ్యాగును ఎత్తుకెళ్లారు. బ్యాంకులో నగదు డిపాజిట్ చేసి కారు వద్దకు వచ్చిన ప్రకాశ్ అద్దం పగిలి ఉండడం, సీటుపై బ్యాగు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, సీఐ దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. దుండగుల కోసం గాలింపు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా కొంత కాలం క్రితం ఇదే తరహా చోరీ హైదరాబాద్ రోడ్డులో కూడా జరిగింది.


బాధితుడు ప్రకాశ్


ధ్వంసమైన కారు అద్దం

పీహెచ్‌డీ సీటు ఇవ్వాలని అభ్యర్థి వేధించారు

- కేయూ ఫార్మసీ కళాశాల డీన్ సమ్మయ్య ఆరోపణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో పీహెచ్‌డీ సీటు ఇవ్వాలని మనోహర్ అనే అభ్యర్థి తనను వేధింపులకు గురిచేశారని ఆ కళాశాల డీన్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆరోపించారు. ఈ ఘటనపై ఇటీవల ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా మంగళవారం రాత్రి కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీన్ సమ్మయ్య కథనం ప్రకారం.. ఈనెల 12వ తేదీన మనోహర్‌తోపాటు అతడి స్నేహితులు ప్రిన్సిపాల్ చాంబర్‌కు వచ్చారు. మనోహర్‌కు పీహెచ్‌డీ సీటు కేటాయించాల్సిందేనని, లేనిపక్షంలో చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారు. ఫార్మసీ కళాశాలలో పీహెచ్‌డీ రెండోకేటగిరీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే మెరిట్‌కమ్ రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేశారు. మొదటి, రెండో కేటగిరీ కలిపి 41 మంది అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారు. మెరిట్‌కమ్ రిజర్వేషన్ ప్రకారం మనోహర్‌కు సీటు వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. అయినా ఇదేమి పట్టించుకోకుండా పీహెచ్‌డీ సీటు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంతేగాకుండా ముందు ఎంపికైన అభ్యర్థి స్థానంలో తనకు సీటు ఇవ్వాలని మనోహర్ కొద్దిరోజులుగా సమ్మయ్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో చంపేస్తానని బెదిరించడంతోపాటు దౌర్జన్యం చేయబోయారు. దీంతో సమమ్మ అనారోగ్యానికి గురికావడంతో వైద్య చికిత్సలు చేయించుకున్నాడు. ఈ రిపోర్టులను ఇన్‌చార్జి వీసీకి వాట్సాప్ ద్వారా రిజిస్ట్రార్‌కు, పోలీసుస్టేషన్‌లో నేరుగా ఫిర్యాదుతోపాటు జతచేశానని సమ్మయ్య బుధవారం వెల్లడించారు. ఇదిలా ఉండగా ఓ కానిస్టేబుల్ ఫార్మసీ కళాశాలకు వచ్చి సమ్మయ్య ఫిర్యాదుపై విచారణ చేశారని సమాచారం.

దేశం కోసం గాంధీ కుటుంబం ప్రాణత్యాగాలు

- ప్రధాని మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మహబూబాబాద్ రూరల్ : దేశం కోసం గాంధీ కుటుంబం ప్రాణత్యాగాలు చేసిందని రాష్ట పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీదర్ సింగ్, మహారాష్ట్ర ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మహబూబాబాద్ నెహ్రూ సెంటర్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ బ్రిటీషు పాలకుల కబంధ హస్తాల నుంచి గాంధీ కుటుంబీకులు దేశాన్ని కాపాడారన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వారసుడు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, వెంటనే ప్రధాని మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీని హతమార్చిన గాడ్సేలు ఉన్న పార్టీ బీజేపీ అని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీల పార్టీ కాంగ్రెస్ అని కీర్తించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పేదల గురించి ఆలోచించలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో కొంత మంది ఎమ్మెల్యేలు పిచ్చి కుక్కల మాదిరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ప్రజలు అలాంటి వారికి బుద్ధిచెబుతారన్నారు. దేశం కోసం ప్రాణాత్యాగం చేసిన రాజీవ్ గాంధీ విగ్రహం తెలంగాణ సచివాలయం ఎదుట ఏర్పాటు చేస్తే ప్రతి తల్లి సంతోషిస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ తల్లి విగ్రహం ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటిస్తే కేసీఆర్ తమ స్వలాభానికి మాత్రమే వినియోగించుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, నేతలు ఘనపురపు అంజయ్య, నూనావత్ రాధ, చుక్కల ఉదయ్ చందర్, మిట్టకంటి రామిరెడ్డి, అల్లం నాగేశ్వర్ రావు, చిట్టెం వెంకన్న, కురెల్లి సతీశ్, గొల్లపల్లి ప్రభాకర్, ఎండీ.హరుణ్, పోతురాజు రాజు, బొల్లు రాజు, నీరుటి లక్ష్మీనారాయణ, ఎడ్ల రమేశ్, జమీల్, ఫెరోజ్, ఫయాజ్, యాకూబ్, ఆరెందుల వెంకటేశ్వర్లు, లకావత్ పద్మబాయి, భూక్య లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

'వందేభారత్' పరుగులు..

- నేటి నుంచి కాజీపేట జంక్షన్ మీదుగా రాకపోకలు షురూ..
- వివరాలు వెల్లడించిన రైల్వే అధికారులు


వందేభారత్ ఎక్స్‌ప్రెస్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా గురువారం నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం రాత్రి తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్రలో సికింద్రాబాద్, కాజీపేట, చంద్రాపూర్, నాగ్‌పూర్ ప్రధాన నగరాలను కలుపుతూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌లో ప్రారంభించిన విషయం తెలిసిందే. 585 కి.మీ. దూరంతో 7.20 గంటల ప్రయాణంతో ఈ రైలు 20 కోచ్‌లు కలిగి ఉంటుంది.

చార్జీలు
సికింద్రాబాద్–కాజీపేట టికెట్ ధర చైర్‌కార్–రూ.710, ఎగ్జిక్యూటివ్ చైర్ రూ.1195, కాజీపేట–రామగుండం చైర్‌కార్ రూ.650, ఎగ్జిక్యూటివ్ చైర్ 1070, కాజీపేట–బల్హార్షా చైర్‌కార్ రూ.950, ఎగ్జిక్యూటివ్ చైర్ రూ.1655, కాజీపేట–చంద్రాపూర్ చైర్‌కార్ రూ.975, ఎగ్జిక్యూటివ్ చైర్ రూ.1705, కాజీపేట–నాగ్‌పూర్ చైర్‌కార్ రూ.1280, ఎగ్జిక్యూటివ్ చైర్ రూ.2325.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వివరాలు

నాగ్‌పూర్-సికింద్రాబాద్ (20101) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం తప్ప అన్ని రోజుల్లో ప్రయాణిస్తుంది.

స్టేషన్	సమయం
నాగ్‌పూర్	ఉదయం 5.00 గంటలు
సేవాగ్రామ్	5.43 గంటలు
చంద్రాపూర్	7.03 గంటలు
బల్హార్షా	7.20 గంటలు
రామగుండం	9.08 గంటలు
కాజీపేట జంక్షన్	10.04 గంటలు
సికింద్రాబాద్ జంక్షన్	మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుతుంది.

సికింద్రాబాద్-నాగ్‌పూర్ (20102) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం తప్ప అన్ని రోజుల్లో ప్రయాణిస్తుంది.

స్టేషన్	సమయం
సికింద్రాబాద్	మధ్యాహ్నం 1.00 గంటలు
కాజీపేట జంక్షన్	2.28 గంటలు
రామగుండం	3.23 గంటలు
బల్హార్షా	సాయంత్రం 5. 25 గంటలు
చంద్రాపూర్	05.33 గంటలు
సేవాగ్రామ్	రాత్రి 07.03 గంటలు
నాగ్‌పూర్	08.20 గంటలకు చేరుతుంది.


విష జ్వరంతో మహిళ మృతి

వెంకటాపురం(ఎం): మండలంలోని గుంటూరుపల్లికి చెందిన బండి రమ(43) విషజ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రమ 5 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. మెరుగైన చికిత్స కోసం మంగళవారం హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందింది. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉండగా, గతేడాది వడదెబ్బతో భర్త మృతి చెందాడు. ఈ విషయమై వెంకటాపురం వైద్యాధికారి శ్రీకాంత్‌ను 'సాక్షి' సంప్రదించగా రమ కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందిందన్నారు. విషజ్వరంతో కాదని వివరణ ఇచ్చారు.


రమ (ఫైల్)

చెట్ల పెంపకంతో పూర్వ వైభవం తేవాలి

- రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య
- ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో పర్యటన
- కూలిన వృక్షాల పరిశీలన


తాడ్వాయి ఫారెస్ట్‌లో కూలిన చెట్ల వివరాలు తెలుసుకుంటున్న పొదెం వీరయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి: చెట్ల పెంపకంతో ములుగు జిల్లాకు పూర్వ వైభవం తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, టోర్నడోలకు ములుగు జిల్లాలో అటవీ సంపద భారీ స్థాయిలో దెబ్బతింది. దాదాపు 500 ఎకరాల్లో వృక్షాలు కూలిపోయాయి. ఈ విషయం తన దృష్టికి రావడంతో బుధవారం ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో పర్యటించారు. అంతకు ముందు ఉదయం ములుగు హెడ్ క్వార్టర్‌కు చేరుకున్నారు. ఇక్కడ సంబంధిత అధికారులు.. చైర్మన్ పొదెం వీరయ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తాడ్వాయి చేరుకోగా అదనపు కలెక్టర్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జిల్లా అటవీ అధికారి, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ పొదెం వీరయ్య కాలినడకన వెళ్తూ అడవిని పరిశీలించారు. కూలిన చెట్లకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను డీఎఫ్ఓ వివరించారు. కిలో మీటర్ల మేర నడిచి కూలిన వృక్షాలను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నష్టంపై అంచనా వేసి నివేదికలు రూపొందించి పంపాలన్నారు. అటవీ సంరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ ప్రభాకర్, డీఎఫ్ఓ రాహుల్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన

- వార్డెన్‌కు దేహశుద్ధి



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన వార్డెన్‌కు దేహశుద్ధి చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గాదెరుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్‌లో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని ఆ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటుంది. ఇటీవల వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో విద్యార్థిని ఇంటికి వెళ్లి వార్డెన్ అబ్రహం మొబైల్ ఫోన్‌కు హాయ్ అని మెసేజ్ చేసింది. దీంతో ఇద్దరు ఫోన్‌లో చాటింగ్ చేసుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థినికి వార్డెన్ ఐ లవ్ యూ అని మెసేజ్ చేశాడు. విద్యార్థిని ఈ విషయం తన తండ్రికి చెప్పడంతో బుధవారం పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో స్కూల్ ఆవరణలోనే వార్డెన్ కనిపించడంతో విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు దేహశుద్ధి చేశారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని, స్కూల్ నుంచి తొలగించాలని తల్లిదండ్రులు ఆందోళన చేశారు.